




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








శుక్రవారం 06 మార్చి 2026 | పేజీలు 04 | వెల - 2/- | సంపుటి 01 సంచిక 277 | ప్రచురణ - తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత




## తెలంగాణకు అదనంగా ఐపీఎస్ అధికారుల కేటాయింపు కోరిన సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, ఢిల్లీ, మార్చి 6: తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఐపీఎస్ అధికారుల సంఖ్యను పెంచి కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కోరారు. బుధవారం రాత్రి ఢిల్లీలో జరిగిన భేటీలో రాష్ట్ర విభజన అనంతరం 2016లో మొదటి క్యాడర్ సమీక్ష జరిగిందని, 2021లో జరగాల్సిన రెండో క్యాడర్ సమీక్ష ఆలస్యంగా 2025లో నిర్వహించారని, ఆ సమయంలో కేవలం 7 మంది ఐపీఎస్ అధికారులను మాత్రమే తెలంగాణకు కేటాయించారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 83 మంది ఐపీఎస్ అధికారులు ఉన్నారని, రాష్ట్ర అవసరాల దృష్ట్యా ఆ సంఖ్యను 103కు పెంచాలని విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరాలు, డ్రగ్స్, వైట్ కాలర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అలాగే హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ, ఫ్యూచర్ సిటీ కమిషనర్ ఏర్పాటు, నగర జనాభా పెరుగుదల వంటి కారణాలతో మరిన్ని ఐపీఎస్ అధికారులు అవసరమని తెలిపారు. మూడో క్యాడర్ సమీక్షను నిర్ణీతంగా 2026లోనే నిర్వహించాలని కూడా కోరారు. అనంతరం మావోయిస్టుల లొంగుబాటు, పునరావాసంపై కేంద్ర మంత్రి అమిత్ షాతో సీఎం చర్చించారు. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసింగ్‌లో గణనీయమైన మార్పులు జరిగాయని, రాష్ట్రంలో 591 మంది మావోయిస్టులు ఆయుధాలు వదిలి సాధారణ జీవన ప్రవాహంలో చేరిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల పలువురు మావోయిస్టు అగ్రనేతలు కూడా లొంగుబాటుకు ముందుకు వచ్చారని, వారికి నిబంధనల ప్రకారం పునరావాసం కల్పిస్తున్నామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కూడా సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ అదనపు డీజీపీ విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజీపీ బి. సుమతి పాల్గొన్నారు.



## యుద్ధాలతో సమస్యలు పరిష్కారం కావు సంభాషణే మార్గమని మోదీ వ్యాఖ్య

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 6: ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలు మరియు ఉద్రిక్తతలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ యుద్ధం ద్వారా ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం లభించదని, దేశాలు సంభాషణ మరియు దౌత్య మార్గం ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. భారత్–ఫిన్లాండ్ దేశాల మధ్య డిజిటలైజేషన్, సస్టైనబిలిటీ, శుద్ధ శక్తి, ఆధునిక సాంకేతిక రంగాల్లో సహకారాన్ని పెంపొందించే వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఇరుదేశాలు బలపరిచాయని ఆయన తెలిపారు. ఇదే సమయంలో మధ్యప్రాచ్య పరిస్థితులపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్‌తో కూడా మోదీ ఫోన్‌లో చర్చించి శాంతి, దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.




## తిరుమలాయపాలెంలో రూ.26 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రికి శంకుస్థాపన

సందేశం టైమ్స్, తిరుమలాయపాలెం, మార్చి 6: అర్ధరాత్రి ఆపదొస్తే ఖమ్మం వరకు వెళ్లాల్సిన అవస్థలు ఇక ఉండవని, పేదవారికి తమ ప్రాంతంలోనే నాణ్యమైన వైద్యం అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సుమారు రూ.26 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల ఏరియా ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కేవలం 30 పడకలతో అరకొర వసతులతో ఉన్న ఆసుపత్రి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ప్రసవాలు లేదా అత్యవసర చికిత్సల కోసం ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లా స్థాయి ఆసుపత్రులకు సమానంగా అన్ని సదుపాయాలతో ఈ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నామని, డయాలసిస్ యూనిట్లు సహా ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్యులు, సిబ్బంది విధుల్లో నిబద్ధతతో పనిచేయాలని సూచిస్తూ, ఆసుపత్రి ప్రధాన కేంద్రంలోనే నివసించి సేవలు అందించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. మార్చిలో పనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి డిసెంబర్ నాటికి ఆసుపత్రిని ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు గడువు విధించారు. అనంతరం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నగర ప్రజలకు అందుబాటులోకి మరో రెండు చెరువులు

### రెండు చెరువులు ప్రారంభానికి సిద్ధం





సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 6: నగర ప్రజలకు మరింత పర్యావరణహిత వాతావరణం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మరో రెండు చెరువులను అభివృద్ధి చేసి ప్రారంభానికి సిద్ధం చేసింది. పాతబస్తీలోని చారిత్రక బమ్రుకున్–ఉద్–దౌలా చెరువును ఈ నెల 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనుండగా, మార్చి 9న కూకట్పల్లి నల్లచెరువును కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. హైడ్రా చేపట్టిన చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే అంబర్పేటలోని బతుకమ్మ కుంట గత ఏడాది ప్రారంభమైంది కాగా ఉప్పల్ నల్లచెరువు, మాధాపూర్ సున్నం చెరువు, తమ్మిడికుంటలు నిర్మాణ దశలో ఉన్నాయి. నిజాంల కాలంలో నిర్మితమైన బమ్రుకున్–ఉద్–దౌలా చెరువును ఆక్రమణల నుంచి విముక్తం చేసి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట స్థలాలు, ఔషధ మొక్కలు, సీసీటీవీ పర్యవేక్షణతో విహార కేంద్రంగా తీర్చిదిద్దారు. చరిత్ర ప్రకారం 1770లో మూడవ నిజాం సికందర్ జాహ్ పాలనలో నవాబ్ రుక్న్–ఉద్–దౌలా నిర్మించిన ఈ చెరువు కాలక్రమంలో తగ్గిపోయినా హైడ్రా చర్యలతో మళ్లీ పునరుద్ధరించబడింది. అలాగే కూకట్పల్లి నల్లచెరువులో ఆక్రమణలను తొలగించి పూడికను పూర్తిగా తొలగించి దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంతో అభివృద్ధి చేశారు. వాకింగ్ ట్రాక్, బోటింగ్ సౌకర్యం, ఐల్యాండ్లు, ఇన్లెట్లు–ఔట్లెట్లతో వరద నియంత్రణకు అనుకూలంగా మార్చడంతో ప్రస్తుతం ఇది ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా మారింది.



## వాకిటి శ్రీహరి విడుదల చేసిన తెలంగాణ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీస్ అసోసియేషన్ 2026 డైరీ

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి: మార్చి 6 – తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీస్ అసోసియేషన్, తెలంగాణ పశుసంవర్ధక, ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ 2026 డైరీని అధికారికంగా ఆవిష్కరించారు. ఈ డైరీ ద్వారా రాష్ట్రంలోని పశుసంవర్ధక, వెటర్నరీ విభాగ సిబ్బందికి వృత్తి, సామూహిక సేవల సంబంధించిన అన్ని ముఖ్యమైన సమాచారం, మార్గదర్శక సూచనలు అందించబడతాయని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్వీస్ అసోసియేషన్ సభ్యులు, అధికారులు, అధికారులు ప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి శ్రీహరి మాట్లాడుతూ, పశుసంవర్ధక విభాగ సిబ్బంది వృత్తి అభివృద్ధి, సామూహిక సేవలకు ప్రతిష్టాత్మకంగా సేవలందిస్తూ ప్రజలకు ఉపయోగకరమైన విధానాలను పాటించాలన్నారు. అలాగే, డైరీలో సిబ్బందికి అవసరమైన ప్రతికూల పరిస్థితులు, ఆవిష్కరణలు, లేఖల నమూనాలు, కార్యక్రమ సూచనలు, మరియు తాజా విధానాల వివరాలు సేకరించబడ్డాయని అన్నారు.ముఖ్యంగా డైరీ విడుదల ద్వారా అధికారులు, సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచుకోవడానికి, వాహనాల, పశు సంరక్షణ, సిబ్బంది సంక్షేమ అంశాల్లో సమర్థవంతంగా పనిచేయడానికి అవగాహన పొందుతారని మంత్రి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది డైరీ ఆవిష్కరణను సాదరంగా స్వీకరించి, పని తీరును మరింత సమర్థవంతం చేసుకోవడానికి తమ విశేష సహకారాన్ని ప్రకటించారు.




# తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 'ఫేమస్ తైక్వాండో అకాడమీ' విస్తరణ: నిరుద్యోగ యువతకు అద్భుత అవకాశం

హైదరాబాద్, సందేశం టైమ్స్, ప్రతినిధి శెట్టి వెంకటేష్: భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల శాఖ (MSME) గుర్తింపు పొందిన 'ఫేమస్ తైక్వాండో అకాడమీ ఆఫ్ ఇండియా' (Udyam-TS-27-0048398) తెలుగు రాష్ట్రాల్లో తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. క్రమశిక్షణ, శారీరక దృఢత్వం మరియు సామాజిక గౌరవమే ధ్యేయంగా పనిచేస్తున్న ఈ అకాడమీ, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కొత్త బ్రాంచ్‌ల ఏర్పాటుకు ఫ్రాంచైజీ (అకాడమీ) భాగస్వాములను ఆహ్వానిస్తోంది. కేవలం 3 లక్షల రూపాయల ఒకేసారి పెట్టుబడితో సొంతంగా అకాడమీని ప్రారంభించి, ప్రతి నెల గౌరవప్రదమైన ఆదాయాన్ని పొందే అవకాశాన్ని కల్పిస్తోంది. ముఖ్యంగా ప్రైవేట్ ఉద్యోగాల వేటలో ఉన్న యువతీ యువకులకు ఇది ఒక అద్భుతమైన స్వయం ఉపాధి మార్గం. 20 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. అకాడమీ నిర్వహణకు అవసరమైన పూర్తి స్థాయి వృత్తిపరమైన శిక్షణను సంస్థే అందిస్తుంది. కేవలం ఫ్రాంచైజీలకే కాకుండా, తైక్వాండో కోచ్‌లుగా స్థిరపడాలనుకునే వారికి ఉచిత జాయినింగ్ (Free Joining) సదుపాయం కల్పించడం విశేషం. మూడు నెలల ప్రత్యేక శిక్షణ అనంతరం అభ్యర్థులు ప్రొఫెషనల్ కోచ్‌లుగా మారి, తమ ప్రాంతంలో తామే బాస్‌గా ఉంటూ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావచ్చు. ఆసక్తి గల వారు మరిన్ని వివరాల కోసం 9052045435 నంబరులో సంప్రదించాలని అకాడమీ ప్రొప్రైటర్ శెట్టి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు.



# భద్రాచలం సీతారాముల కల్యాణానికి తలంబ్రాల ప్యాకెట్ల బుకింగ్ ప్రారంభం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 6: భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో దేవాదాయ శాఖ సహకారంతో భక్తుల ఇళ్లకు తలంబ్రాల ప్యాకెట్లను చేరవేసే కార్యక్రమాన్ని టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ ప్రారంభించింది. తలంబ్రాల ప్యాకెట్లు పొందదలచిన భక్తులు టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా లాజిస్టిక్స్ కౌంటర్లలో, అలాగే ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ ద్వారా ఒక్క ప్యాకెట్ ధర రూ.151 చెల్లించి బుక్ చేసుకోవచ్చని సంగారెడ్డి డిపో మేనేజర్ పి. ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు సంగారెడ్డి డిపో 9154298652, జోగిపేట్ 8501091966, 9063461216, సదాశివపేట 7013287369, ఆర్ఎం కార్యాలయం 9154298674 నంబర్లను సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు



# ప్రజా పాలన 99 రోజుల కార్యాచరణ సమర్థవంతంగా అమలు చేయాలి

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 6: జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా, సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలిసి జిల్లా అధికారులతో సమగ్ర దిశానిర్దేశం నిర్వహించిన అనంతరం ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 6 నుండి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో తడి–పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ 6 నుండి 11 వరకు ఆరోగ్యం అంశంపై ఆరోగ్య శిబిరాలు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 13 నుండి 18 వరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు, ట్రాఫిక్ నియమాల అమలు, హెల్మెట్–సీట్‌బెల్ట్ తనిఖీలు చేపట్టనున్నారు. ఏప్రిల్ 20 నుండి 25 వరకు సంక్షేమ కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మే 4 నుండి 9 వరకు రైతులకు సాగు సలహాలు, ఎరువులు–విత్తనాల లభ్యత, సాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ అంశాలపై చర్యలు తీసుకోనున్నారు. మే 11 నుండి 16 వరకు పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, బోధన నాణ్యతపై సమీక్షలు జరగనున్నాయి. మే 18 నుండి 23 వరకు యువత, క్రీడల అభివృద్ధి కార్యక్రమాలు, మే 25 నుండి 30 వరకు మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాల బలోపేతం కార్యక్రమాలు చేపట్టనున్నారు. జూన్ 1 నుండి 12 వరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యాచరణ గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు దశల్లో అమలు చేయబడుతుందని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాల్లో భోజన నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితులను ప్రతిరోజూ తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు స్థితి, పారిశుద్ధ్య కార్యక్రమాలు, డ్రైనేజీ విస్తరణ తదితర అంశాలపై పూర్తి అవగాహనతో పని చేయాలని సూచించారు. కార్యక్రమాలపై ప్రతిరోజు ప్రగతి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో శిరీష, సిపిఓ యాదగిరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 6: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్స్ హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్ మరియు హన్మకొండలో నాలుగో తరగతి ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విడుదల చేశారు. సూర్యాపేట జిల్లాకు చెందిన ఆసక్తి గల బాలబాలికలు మార్చి 12 లోపు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులకు మార్చి 13 నుంచి 17 వరకు మండల విద్యాధికారి ఆధ్వర్యంలో మండల స్థాయిలో హైట్, వెయిట్, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగులు, 6×10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ పుట్, వెర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ వంటి తొమ్మిది మోటార్ క్వాలిటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 10 మంది బాలురు, 10 మంది బాలికలను జిల్లా స్థాయి ఎంపికలకు పంపిస్తారు. అనంతరం మార్చి 28 నుంచి ఏప్రిల్ 1 వరకు జిల్లా స్థాయిలో మరోసారి పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపుతారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు 8 నుంచి 9 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని, 01-09-2017 నుంచి 31-08-2018 మధ్య జన్మించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. దరఖాస్తు సమయంలో స్టడీ సర్టిఫికేట్, జనన ధృవీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి బి. వెంకట్ రెడ్డి తెలి

# రోడ్డు ప్రమాదానికి కారణమైన కార్ డ్రైవర్‌కు 15 నెలల జైలు శిక్ష

సందేశం టైమ్స్, అనంతగిరి, మార్చి 6: అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటనకు సంబంధించి కార్ డ్రైవర్‌కు కోదాడ మొదటి అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి మహమ్మద్ ఉమర్ 15 నెలల జైలు శిక్షతో పాటు రూ.2500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. 2024 ఫిబ్రవరి నెలలో తమరబండపాలెం గ్రామ శివారులో గోండ్రియాల వెళ్లే మార్గంలోని నూతన బైపాస్ అండర్‌పాస్ వద్ద కార్ మరియు ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గొండ్రియాల గ్రామానికి చెందిన బండారు మోహన్‌రావు అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న బండారు పవన్ గాయపడ్డాడు. పల్నాడు జిల్లాకు చెందిన షేక్ బాజీ కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు కేసు నమోదైంది. మృతుడి భార్య బండారు రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై అనిల్ రెడ్డి కేసు నమోదు చేయగా, ప్రస్తుత ఎస్సై నవీన్ కుమార్ దర్యాప్తు పూర్తి చేసి అభియోగపత్రాలు న్యాయస్థానంలో దాఖలు చేశారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడు నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్ల ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందడం, మరొకరు గాయపడినట్లు నిర్ధారించి 15 నెలల జైలు శిక్షతో పాటు రూ.2500 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 15 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తామని తీర్పులో పేర్కొన్నారు. ప్రమాదంలో వ్యక్తి మరణం సమాజంపై జరిగిన క్రిమినల్ చర్యగా పరిగణించబడుతుందని, పార్టీలు రాజీ పడినా కేసు నుంచి విముక్తి లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసులో ప్రభుత్వ తరఫున ఎపీపీ మహమ్మద్ గౌస్ పాషా వాదించగా, పీసీ ఏడుకొండలు సహకరించారు అని అనంతగిరి ఎస్సై నవీన్ తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్ అమలు చేయాలి




సందేశం టైమ్స్, ఖమ్మం, మార్చి 6: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో భాగంగా తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం మరియు పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలని తెలంగాణ తొలి దశ, మలి దశ ఉద్యమకారుడు ఎదురుగట్ల చిట్టిమల్లు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాల్లో తాను చురుకుగా పాల్గొన్నానని, ఖమ్మంలోని దానవాయిగూడెం సబ్ జైలులో కేసీఆర్ నిర్బంధంలో ఉన్న సమయంలో జైలు బయట రాత్రింబవళ్లు కూర్చొని ఉద్యమానికి మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ, తనపై నమ్మకం ఉంచిన తెలంగాణ రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మరియు ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పాలకుర్తి కృష్ణలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

# సర్పంచ్ కుమార్తె వివాహానికి హాజరైన మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతికిరణ్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 6: సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం ముంగి ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సిరూర్ గ్రామ సర్పంచ్ మారుతి కుమార్తె వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతికిరణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమానికి విచ్చేసిన చంటి క్రాంతికిరణ్‌కు సిరూర్ ఉప సర్పంచ్ శివకుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాయికోడ్ మండలానికి చెందిన పలువురు సర్పంచులు, కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కల నెరవేరింది: భీమ్ భరత్





సందేశం టైమ్స్, చేవెళ్ల, మార్చి 6: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం చందిప్ప గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ మరియు వారి సతీమణి, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షాన నిలుస్తుందని, పేదల సంక్షేమం కోసమే పనిచేస్తుందని తెలిపారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ పేదల కలలను నెరవేర్చుతున్నారని, పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, బద్దం కృష్ణ రెడ్డి, సేవాలాల్ అధ్యక్షుడు నసీరోద్దీన్, మాజీ ఎంపిటిసి అజాజ్, కౌన్సిలర్ సమీ, డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, శశికిరణ్, తౌఫిక్, శివ, అంతప్పగూడ పెంటయ్య, యూత్ కాంగ్రెస్ నాయకుడు సంజయ్, సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# గచ్చిబౌలి హాకీ స్టేడియంలో 8 నుంచి ఉమెన్ వరల్డ్ హాకీ కప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 6: ఈ నెల 8 నుండి 14 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి హాకీ స్టేడియంలో నిర్వహించనున్న ఉమెన్ వరల్డ్ హాకీ కప్ 2026 క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసులు, పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఎల్బీ స్టేడియంలో గురువారం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతుందని చెప్పారు. ధ్యాన్ చంద్ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాలిఫైయింగ్ మహిళల టోర్నమెంట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ పోటీల్లో భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ జట్లు పాల్గొంటున్నాయని, అన్ని జట్లు ఇప్పటికే హైదరాబాద్‌కు చేరుకుని గచ్చిబౌలిలోని అంతర్జాతీయ ప్రమాణాల ఆస్ట్రోటర్ఫ్ మైదానంలో సాధన చేస్తున్నాయని చెప్పారు. క్రీడాకారులకు అత్యుత్తమ వసతి, భద్రతా ఏర్పాట్లు, ఆధునిక సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు విశేష ప్రోత్సాహం అందిస్తోందని, ఇటీవల నిర్వహించిన ముఖ్యమంత్రి కప్ పోటీలు గ్రామ స్థాయి నుంచి విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. గచ్చిబౌలిలో జరిగే హాకీ పోటీలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ చైర్మన్ కె శివసేనా రెడ్డి, ఎస్ఏటీజీ ఎండీ సోని బాల మాయాదేవి మరియు ఇతర క్రీడా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి: కలెక్టర్ పి. ప్రవీణ్య





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 6: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల పాటు నిర్వహించనున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దిశానిర్దేశం చేస్తూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్చి 6 నుండి జూన్ 12 వరకు పరిశుభ్రత, ఆరోగ్యం, రహదారి భద్రత, సంక్షేమ పథకాల అమలు, బాలల రక్షణ, వ్యవసాయం, విద్య, యువత-క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి పది అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ 99 రోజుల కార్యాచరణ గ్రామం నుండి రాష్ట్ర స్థాయి వరకు ఐదు దశల్లో అమలు చేయబడుతుందని పేర్కొంటూ కార్యక్రమాలపై రోజువారీ ప్రగతి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి డా. శివప్రసాద్, డీఆర్డీఓ జ్యోతి, డీడబ్ల్యూఓ లలితకుమారి, జిల్లా వైద్యాధికారి డా. వసంతరావు, హౌసింగ్ పీడీ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు అని జిల్లా ప్రతినిధి టి. సంగమేశ్వర్ తెలిపారు.



# తారా ప్రభుత్వ కళాశాలలో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 6: సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ కళాశాలలో జీవశాస్త్రం మరియు కంప్యూటర్ విభాగాల ఆధ్వర్యంలో "ది ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ సైన్స్: కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ అండ్ బయోలాజికల్ రీసెర్చ్" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది అని సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి. సంగమేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా విభాగం సంయుక్త డైరెక్టర్లు ప్రొఫెసర్ బాలభాస్కర్, ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్ ముఖ్య అతిథులుగా హాజరై సదస్సు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవశాస్త్రంలో జరుగుతున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా ఈ సదస్సు అంశం ఎంతో ప్రాసంగికమని, సాంకేతిక సెషన్లలో నిపుణులు సూచించే విషయాలను విద్యార్థులు, పరిశోధకులు వినియోగించుకోవాలని తెలిపారు. మొదటి రోజు టెక్నికల్ సెషన్లలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన డా. మంజరి కిరణ్ "సిస్టమ్స్ అండ్ కంప్యూటేషనల్ బయాలజీ"పై, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. శశి కిరణ్ జీవశాస్త్రంపై ఆధునిక పరిణామాల ప్రభావంపై, జేఎన్టీయూ సుల్తాన్‌పూర్ ప్రిన్సిపల్ డా. ఎస్. విశ్వనాథ ఆధునిక పరిశోధనల్లో కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యతపై ఉపన్యాసాలు ఇచ్చారు. ఈ సదస్సులో రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులు, పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. ప్రవీణ, కన్వీనర్ డా. నాగప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. మిథున్ కుమార్ రాథోడ్, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి దేవాలయం తృతీయ వార్షికోత్సవం

వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి దేవాలయం తృతీయ వార్షికోత్సవం





సందేశం టైమ్స్, రాయికోడ్, మార్చి 6: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం కర్చల్ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి దేవాలయం తృతీయ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారని సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి. సంగమేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి గ్రామ పురవీధుల్లో డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మండల నాయకులు కుసునూర్ సతీష్ కుమార్ పాటిల్, సింగీతం ప్రభాకర్, సింగీతం రాజు కూర్మ, గ్రామ పెద్దలు, గౌడ సంఘం నాయకులు, మాజీ సర్పంచ్ గంప చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ గాజుల బాబుకుమార్, సొసైటీ మాజీ చైర్మన్ నజీర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# బిజిలిపూర్‌లో రేణుక ఎల్లమ్మ బోనాల సందర్భంగా అన్నదానం



సందేశం టైమ్స్, వట్పల్లి, మార్చి 6: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం బిజిలిపూర్ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో బోనాల సందర్భంగా గ్రామ సర్పంచ్ నాగమణి నర్సింలు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారని సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి. సంగమేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు మల్లేశం పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామ ఐక్యతను పెంపొందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామస్థులు, యువకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగినులకు క్రీడా పోటీలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 6: టీఎన్జీవోస్ సంగారెడ్డి జిల్లా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉద్యోగినుల కోసం వివిధ క్రీడా పోటీలను నిర్వహించారని సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి. సంగమేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీమతి పి. ప్రవీణ్యా ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మహిళా ఉద్యోగినులతో కలిసి క్యారం, చెస్ వంటి క్రీడలను ఆడి ప్రోత్సహించారు. మహిళల్లో ఐక్యత, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన పోటీ భావన పెంపొందించేందుకు షటిల్ బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్, క్యారం, చెస్ తదితర పోటీలు నిర్వహించగా మహిళా ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ జావిద్ అలీ, జిల్లా కార్యదర్శి వేల్పూరు రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి నిర్మల రాజ్ కుమారి, సుధామణి సమన్వయం చేశారు. విజేతలకు ఈ నెల 9న బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి, టీఎన్జీవోస్ సంఘం నాయకులు మరియు వివిధ శాఖల మహిళా ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# చెన్నగౌడ్ స్ఫూర్తితో కల్లుగీత వృత్తి రక్షణ కోసం ఉద్యమం కొనసాగుతుంది

## జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్

సందేశం టైమ్స్, మెదక్ జిల్లా, మార్చి 6: కల్లుగీత ఉద్యమ నిర్మాత కీర్తిశేషులు చెన్నగౌడ్ ఐదవ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డిలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులు అర్పించారని అందోల్ నియోజకవర్గం ఇన్‌చార్జి కె. మల్లేశం గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ గ్రామం తిరిగి కల్లుగీత కార్మికులను సమీకరించి వారి హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడు చెన్నగౌడ్ అని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో కల్లుగీత వృత్తి రక్షణ మరియు గీతా కార్మికుల ఉపాధి కోసం నిరంతరం ఉద్యమిస్తామని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత వృత్తి సంక్షేమానికి 5000 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా నాయకులు రవీందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, చెన్నగౌడ్, సత్యా గౌడ్, నాగేష్, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.




# ఇన్‌స్టాగ్రామ్ పరిచయంతో ఇంటి నుంచి వెళ్లిన బాలికను కాపాడిన కావలి పోలీసులు

సందేశం టైమ్స్, కావలి, మార్చి 6: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడి మాటలు నమ్మి ఇంటి నుంచి వెళ్లిన ఓ బాలికను కావలి పోలీసులు అప్రమత్తంగా స్పందించి రక్షించారని సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి. సంగమేశ్వర్ తెలిపారు. జూనియర్ ఇంటర్ పరీక్షలు రాసిన అనంతరం విశాఖపట్నం నుంచి వచ్చిన ఆ బాలికను తిరుమలలో పెళ్లి చేసుకుందామని యువకుడు సందేశం పంపడంతో ఉచిత బస్సులో విజయవాడ మీదుగా కావలికి చేరుకుంది. ఈ నెల 2వ తేదీ రాత్రి కావలి బస్టాండ్‌లో దిగిన తర్వాత ఆ యువకుడు కనిపించకపోవడంతో అక్కడ డ్యూటీలో ఉన్న పోలీసుకు అనుమానం వచ్చి విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే బాలికను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి మహిళా పోలీసులకు అప్పగించారు. సీఐ బాలికకు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులను పిలిపించి వారికి అప్పగించారు. సోషల్ మీడియా ద్వారా అపరిచితులపై నమ్మకం పెట్టుకోవడం వల్ల ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందని బాలికకు అవగాహన కల్పించారు. అనంతరం వచ్చిన తల్లిదండ్రులను చూసి బాలిక భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకోగా తమ బిడ్డను కాపాడిన పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టి సోషల్ మీడియాలో వారు ఎవరితో మాట్లాడుతున్నారో గమనించాలని సూచించారు.

# ఇంద్రేశం మున్సిపాలిటీలో పరిశుభ్రత కార్యక్రమాలు, మంచినీటి సమస్య పరిష్కారం



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మార్చి 6: పటాన్‌చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో నాలుగో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మన్నే లక్ష్మి ఆధ్వర్యంలో విస్తృత పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టినట్లు మండల ప్రతినిధి బి. డేవిడ్ తెలిపారు. కాలనీలో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు త్రాగునీటి సమస్యను కూడా పరిష్కరించారు. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే గుర్తించిన మన్నే లక్ష్మి 24 గంటల్లోనే పరిశుభ్రత పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. కాలనీలో పేరుకుపోయిన చెత్తను తొలగించి ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించడంతో పాటు మంచినీటి సమస్యను దగ్గరుండి పరిష్కరించినట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఈ చర్యలను అభినందించారు.

# పటాన్చెరులో భారీ చోరీ... 15 తులాల బంగారం, కిలో వెండి దోపిడీ



పటాన్చెరు, మార్చి 6 (సందేశం టైమ్స్ పటాన్చెరు మండల్ రిపోర్టర్ బి డేవిడ్,) పటాన్చెరు మండలం చిట్కుల్‌లో పగలే భారీ చోరీ చోటుచేసుకుంది. బాధితుడు చంద్రశేఖర్ రెడ్డి బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి సుమారు 15 తులాల బంగారం, కిలో వెండి అపహరించారు. ఇంటికి తిరిగి వచ్చిన బాధితుడు దోపిడీ జరిగిన విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పగటి వేళ జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.




# ఉత్కంఠ పోరులో ఇంగ్లాండ్‌పై భారత్ ఘనవిజయం, ఫైనల్‌లో న్యూజిలాండ్‌తో ఢీ

సందేశం టైమ్స్, ముంబై, ప్రతినిధి శెట్టి వెంకటేష్, 6 మార్చ్ 2026: వాంఖడే స్టేడియంలో జరిగిన 2026 ఐసిసి టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్‌లో భారత క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో ఇంగ్లాండ్‌పై 7 పరుగుల తేడాతో ఉత్కంఠభరిత విజయం సాధించింది. తొలి బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు సాధించి బలమైన స్కోరు ఏర్పరచగా, జవాబుగా ఇంగ్లాండ్ జట్టు 246–7 వద్దే పరిమితమైంది. ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ జానక్ బెథెల్ 105 పరుగుల హీరోగా నిలిచినప్పటికీ ఇండియా బౌలర్లు కీలక సమయంలో వికెట్లు తీస్తూ విజయంలో కీలక పాత్ర పోషించారు, ప్రత్యేకంగా అక్షర్ పటేల్ మరియు హార్దిక్ పాండ్యా ప్రభావవంతమైన బౌలింగ్ చేసి జట్టు విజయం ఖాయం చేశారు. ఈ విజయం భారత్‌ను 8 మార్చ్‌ను ఫైనల్‌కు తరలించింది. ఫైనల్‌లో భారత్ న్యూజిలాండ్‌తో ఢీర్ఘ ప్రత్యర్థిత పోరుకు సిద్ధమవుతోంది; ఈ మ్యాచ్ 2026 ఐసిసి టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో ఆహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో నిర్వహించబడనుంది, ఇది 7 PM ISTకు షెడ్యూల్ అయింది. ఈ ఫైనల్‌లో రెండూ జట్లు భయంకరమైన ప్రతిస్పందనతో నిలబడడంతో వందలాది లక్షల అభిమానుల ఉత్కంఠ కొనసాగుతుంది, మరియు ప్రపంచ ఛాంపియన్ మాత్రమే ఎవరు అవుతారో ఆసక్తికరంగా మారింది.

# రాంసాన్‌పల్లిలో ఉపాధి హామీ పనులకు శ్రీకారం



సందేశం టైమ్స్, అందోల్, మార్చి 6: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద గొర్రెకుంట కట్ట వద్ద జంగిల్ కటింగ్ పనులను ప్రారంభించారని సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి. సంగమేశ్వర్ తెలిపారు. ఈ పనులను పర్యవేక్షిస్తూ పని ప్రదేశంలో కుమ్మరి శివకుమార్ పాల్గొన్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామ అభివృద్ధి జరిగి కార్మికులకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా వికలాంగుల వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నే పోచయ్య, తలారి శంకరయ్య, గ్రామ సీఏ మన్నే హేమలత, బాగరి వెంకటేశం, పండుగ నారాయణ, పుల్లంగారి దుర్గయ్య, సాదుల శివకుమార్, సాదుల బాలయ్య, వర్థపాటి రత్నయ్య, పుల్లంగారి గంగయ్య తదితరులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పనులను సమర్థవంతంగా అమలు చేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడతామని నిర్వాహకులు తెలిపారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / యజమాని / సంపాదకురాలు: కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.